# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కేంద్రజలశక్తి శాఖ మంత్రితో సమావేశమయ్యారు.**
2. **రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును సెమిస్టర్ ల వారీగా కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**
3. **ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.**
4. **ఆహార శుద్ధి రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన అల్లానా గ్రూప్ ముందుకొచ్చిందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు.**
5. **రాష్ట్రంలో కొత్తగా ఎక్కడా బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కాలేదని పశుసంవర్ధకశాఖ సంచాలకులు టి.దామోదర్‌నాయుడు స్పష్టం చేశారు.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఉదయం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సమావేశమై... పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన ఆర్థిక సాయంపై చర్చించారు.అనంతరం రామ్‌లీలా మైదానంలో జరిగిన ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా ముఖ్యమంత్రి మధ్యాహ్నం కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, ఇతర సాయంపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును సెమిస్టర్ ల వారీగా కళాశాలల ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తిరుపతిలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 7.5 కోట్ల రూపాయలతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ మైదానం, ఏరోబిక్స్, తైక్వాండో, యోగా కేంద్రాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిశోధనలు, ఆవిష్కరణలపై యువత దృష్టి పెట్టాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు రాణించేలా విశ్వవిద్యాలయాల

విద్యా విధానంలో సమూల మార్పులు తెస్తామన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఇంజినీరింగ్ విద్యను కూడా సమాంతరంగా అభివృద్ధి చేసి మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మంత్రి వివరించారు.

-----------------------------

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ కానూరులో మంత్రి నిన్న పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పౌర సరఫరాల శాఖ నుంచి సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో దుర్వినియోగం, అక్రమాల నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు.

-----------------------------

రాష్ట్రప్రభుత్వం కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తిరుపతి సమీపంలోని యోగిమల్లవరం ఆలయాన్ని మంత్రి ఈరోజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ ఈఎస్ఐ వైద్యసేవలను కార్మికులకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

-----------------------------

ఆహార శుద్ధి రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన అల్లానా గ్రూప్ ముందుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. దుబాయ్‌లో జరుగుతున్న గల్ఫ్ ఫుడ్-2025 సదస్సులో మంత్రి టీజీ భరత్, అల్లానా గ్రూప్ ఎండీ ఇర్ఫాన్ అల్లానా ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ, అల్లానా గ్రూప్, ఇఫ్‌కో సంస్థతో కలిసి ఆహార శుద్ధి రంగంలో 200 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుందని తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతంలో పౌల్ట్రీ, పండ్ల శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయనుందని వీటిద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి వివరించారు.

-----------------------------

రాష్ట్రంలో కొత్తగా ఎక్కడా బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కాలేదని, ప్రజలు ఎలాంటి ఆందోళనా చెంద వద్దని పశు సంవర్ధకశాఖ సంచాలకులు టి.దామోదర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నిఘా కొనసాగుతున్న పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండల పరిధిలోని 5 గ్రామాల్లో తప్ప రాష్ట్రంలో మరెక్కడా కోళ్లు, గుడ్ల రవాణాపై ఆంక్షలు లేవని వివరించారు. ఎక్కడైనా కోళ్లు, గుడ్ల రవాణాను అడ్డుకుంటే 0866-2472543 లేదా 9491168699 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అసత్య ప్రచారం కారణంగా కోళ్ల పరిశ్రమపై ఆధారపడిన వారు జీవనోపాధి కోల్పోతున్నారని తెలిపారు. కోడి మాంసం, గుడ్ల వాడకాన్ని ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించనున్నట్లు దామోదర్‌నాయుడు వివరించారు.

-----------------------------

అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గుంటూరు జిల్లా సబ్ కలెక్టర్ సంజనా సింహ కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ లో నిన్న తొలిసారి జీవన్మృతురాలి నుంచి అవయవాలను సేకరించారు. విజయవాడ భవానీ పురంకు చెందిన సరస్వతి అనే మహిళ ఈనెల 14న జరిగిన రహదారి

ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆమె బ్రెయిన్ డెడ్ కు గురైనట్టు వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శాంత సింగ్, వైద్యులు మృతి చెందిన మహిళకు నివాళులు అర్పించారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సింహ పాత్రికేయులతో మాట్లాడుతూ,....

వాయిస్ ,...35 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలపై ప్రసార మాధ్యమాలకు సమాచారాన్ని అందించే బాధ్యత పత్రికా సమాచార కార్యాలయానికి ఉంటుందని పీఐబీ ఆంధ్రప్రదేశ్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి తెలిపారు. తిరుపతిలో పిఐబి ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన ఇంటర్‌మీడియా పబ్లిసిటి కో ఆర్డినేషన్ కమిటి -ఐఎంపిసిసి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ.. పిఐబి ప్రభుత్వానికి, మీడియాకు వారధిలా పనిచేస్తుందని తెలిపారు. అసత్య వార్తల ప్రచారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వాటి నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో క్షయను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమం-ఎన్‌టీఈపీపై జిల్లా టిబి ఫోరం కమిటీ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో టీబీ నిర్మూలన కూడా ప్రధానమైందని, జిల్లాలో 10 టీబీ యూనిట్ల ద్వారా ఎన్‌టీఈపీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. క్షయను తొలిదశలోనే గుర్తించడం వల్ల మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందని చెప్పారు. క్షయ నియంత్రణ చర్యలలో స్థానిక సంస్థలను ప్రోత్సహించేందుకు టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమాన్ని కూడా అమలుచేయడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు.

---------------------------

దేశంలోని భిన్న సంస్కృతుల గురించి యువతకు తెలియజేసేందుకు అంతర్రాష్ట్ర సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాన్నినిర్వహిస్తున్నామని గుంటూరు జిల్లా నెహ్రూయువ కేంద్ర అధికారి డి. కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల శాఖ అధ్వర్యంలోని నెహ్రూయువ కేంద్ర ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా ఈ నెల 25 నుండి ఒడిసాలోని మయూర్ భంజ్, ఫుల్బాని, కలాహాండి, గంజామ్, నబ్రంగ్ పూర్ జిల్లాల నుండి 25 మంది రాష్ట్రంలో పర్యటించనున్నారని అన్నారు. వీరికి రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, ఉపాధి అవకాశాలు వంటి పలు అంశాల గురించి నెహ్రూ యువ కేంద్ర అవగాహన కల్పించనుందని వివరించారు.

=====================